## పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రస్సల్ సిస్టమ్‌కు 104 అర్జీలు



చిత్తూరు, జులై 1 ప్రభాతవార్త: ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రస్సల్ సిస్టమ్‌కు ఈ వారం జిల్లా నలుమూలల నుండి సమస్యలపై 104 అర్జీలు అధికారులకు సమర్పించారు. పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రస్సల్ సిస్టమ్‌కు హాజరైన కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యకమంలో రెడెన్యూ శాఖకు సంబంధించి అత్యధికంగా 81 అర్జీలు అధికారులకు అందాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్‌ఓ బి.పుల్లయ్య, డ్వామా పిడి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త




## శాంతిపురం డిప్యుటీ సర్వేయర్‌పై సస్పెన్షన్ వేటు



చిత్తూరు, జులై 1 ప్రభాతవార్త: శాంతిపురం మండల డిప్యుటీ సర్వేయర్ ఎస్.సద్దాం హుస్సేన్‌పై జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివవాసులు సస్పెన్షన్ వేటు వేశారు. శాంతిపురం మండల డిప్యుటీ సర్వేయర్ ఎస్.సద్దాంహుస్సేన్ జూన్ 27వ తేదీ ఒక రైతు తన భూములు సర్వే చేయాలని రావడంతో డిప్యుటీ సర్వేయర్ ఆ రైతు నుండి ఒక లక్ష రూపాయలు ఇస్తే వస్తానని పేర్కొన్నట్లు తెలిసింది. ఈ మేరకు ఆ రైతు జిల్లా అధికారులను కలిసి డిప్యుటీ సర్వేయర్‌పై ఫిర్యాదు చేశాడు. దీనిపై జాయింట్ కలెక్టర్ డిప్యుటీ సర్వేయర్ ఎస్.సద్దాం హుస్సేన్‌ను లిఖిత పూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశించారు. డిప్యుటీ సర్వేయర్ ఇచ్చిన సమాధానంపై జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు విచారణకు ఆదేశించారు. ఎపి సివిల్ సర్వీసెస్ యాక్ట్ 8 ప్రకారం సర్వే ల్యాండ్ రికార్డ్స్ జిఓఎంఎస్ నెం.102 రెవెన్యూ(ఎస్ఎస్‌టు)' ప్రకారం డిప్యుటీ సర్వేయర్ సస్పెన్షన్‌ను సస్పెన్షన్‌కు సిఫార్సు చేయగా ఆ మేరకు జాయింట్ కలెక్టర్ అతనిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# పెన్షన్ల జాతర

## జిల్లాలో ఎన్టీఆర్‌భరోసా పెన్షన్ల అందజేత అవ్వాతాతల కళ్ళల్లో ఆనందం



పెంచిన పెన్షన్ మొత్తం మెగా చెక్కును లబ్ధిదారులకు అందిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు

చిత్తూరు, జులై 1 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జులై నెల నుండి పెంచిన సామాజిక పెన్షన్ల మొత్తంను లబ్ధిదారులకు అందించడానికి శ్రీకారం చుట్టడంతో పెన్షన్‌దారుల ముఖంలో ఆనందం తాండవిస్తోంది. ఎన్టీఆర్ భరోసా పెంచిన పెన్షన్ కార్యక్రమంను సోమవారం తెల్లవారుజాము 6 గంటల నుండి సచివాలయ సిబ్బంది, తెలుగుదేశం పార్టీ నాయకులు పెన్షన్ లబ్ధిదారుల ఇళ్ళ వద్దకు వెళ్ళి పెంచిన పెన్షన్ మొత్తంను అందజేశారు. జులై నెల పెంచిన పెన్షన్ రూ.4 వేలతో పాటు ఏప్రిల్, మే, జూన్ నెలలో పెంచిన మొత్తం ఒకొక్క వెయ్యి రూపాయలు చొప్పున మొత్తం రూ.3 వేలు కలిపి ప్రతి పెన్షన్ లబ్ధిదారుడికి మొత్తం రూ.7 వేలు చెల్లించారు. ఒకేసారి పెన్షన్‌దారుడి చేతిలో రూ.7 వేలు సచివాలయ సిబ్బంది పెట్టడంతో వారి ముఖంలో ఆనందం వెల్లివిరిసింది. జిల్లాలో జులై నెలకు సంబంధించి 2.71 లక్షల మంది పెన్షన్‌దారులకు రూ.181 కోట్లు పంపిణీ చేయాల్సివుండగా బుధవారం సాయంత్రం 3.30 గంటలకే 80 శాతం మేరకు పెన్షన్ల పంపిణీని సచివాలయ సిబ్బంది పూర్తి చేశారు. చిత్తూరులో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పెన్షన్ల పంపిణీ కార్యక్రమంను గాంధీ నగర్‌లో నిర్వహించి లబ్ధిదారులకు అందజేసి ఆపై నాగయ్య కళాక్షేత్రంలో నగరం మొత్తం పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ పూతలపట్టు మండలం పేటమిట్ట గ్రామంలో లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ కార్యక్రమంను ప్రారంభించి ఆపై తవణంపల్లి, యాదమరి మండలాల్లో జరిగిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లను పంపిణీ చేశారు. జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ గంగాధనెల్లూరు మండలం, ఎస్ఆర్ పురం, పాలసముద్రం మండలాల్లో పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పలమనేరు ఎమ్మెలల్యే అమరనాథరెడ్డి పలమనేరులో పెన్షన్ల పంపిణీని లబ్ధిదారులకు చేపట్టారు. కుప్పంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో లబ్ధిదారుల పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తన నియోజకవర్గ పరిధిలోని నగరిలో పెన్షన్ల పంపిణీ చేపట్టారు.

### చిత్తూరులో

సిఎం నారా చంద్రబాబునాయుడు పెంచిన పెన్షన్ల మొత్తంతో లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందం వెల్లివిరుస్తోందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెంచిన పెన్షన్ మొత్తంతో పాటు ఏప్రిల్ నుండి కలిపి లబ్ధిదారులకు అందించే కార్యక్రమంను చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో సోమవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణలు లబ్ధిదారులకు పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, మాజీ మేయర్ కఠారి అనురాధ, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, తెలుగుదేశం పార్టీ నాయకులు, జనసేన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

### ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



తిరుపతి కార్పొరేషన్, జూలై 1, ప్రభాతవార్త

ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఫించన్ లబ్ధిదారులకు నాలుగు వేల రూపాయిలు పంపిణీ చేసిందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. గత మూడు నెలల పెండింగ్‌తో కలిసి ఏడు వేల రూపాయ లను లబ్ధిదారులకు అందించి ఎన్డీఏ ప్రభుత్వం పేదల పక్షపాతి అని నిరూపించుకుందని ఆయన చెప్పారు. నగరంలోని 35వ డివిజన్‌లో సోమవారం ఉదయం ఆరు గంటలకే వికలాంగురాలుకు నేరుగా ఆమె ఇంటి వద్దే ఆరు వేల రూపాయిల నగదును ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అందించారు. ఎమ్మెల్యేతో పాటు మేయర్ డాక్టర్ శిరీషా, కమిషనర్ అధితి సింగ్, డిప్యూటీ మేయర్ ముద్రానారాయణ, ఫించన్ పంపిణీలో పాల్గొన్నారు. 35వ డివిజన్‌లో ఫించన్ పంపిణీ అనంతరం 44వ డివిజన్‌లో తరువాత మేయర్ డాక్టర్ శిరీష ప్రాతినిథ్యం వహిస్తున్న 27వ డివిజన్‌లోని గంగమ్మ గుడి ప్రాంత నగదు లబ్ధిదారులకు ఎమ్మెల్యే  పంపిణీ చేశారు. అలాగే 5,6,7,8,9,42,43, 47,48,49,30,23,24,39 డివిజన్‌లలో ఎమ్మెల్యే ఆరణిశ్రీనివాసులు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలోని 102 వార్డు సచివాలయాల ద్వారా 19343 మంది సబ్ధిదారులకు సుమారు 1300 కోట్ల 30 లక్షల 16 వేల 500 రూపాయిలు వివిధ కేటగిరుల ఫించన్‌దారులకు నగదు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆర్‌సి మునికృష్ణ, నారాయణ, రేవతి, కల్పనా యాదవ్, ఉప కమిసనర్ అమరయ్య, రెవెన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, డి. వవిజయ్ విజయ్ కుమార్ రెడ్డి, శ్రావణి, గాలి సుధాకర్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు పద్మావతి వర్సిటీ ఉపకులపతి భారతి రాజీనామా

### -ఇన్‌ఛార్జి విసిగా ఎస్వీయూకి బాధ్యతలు!?




తిరుపతి,జులై 1ప్రభాతవార్త: ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు చేస్తున్న తెల్ల ఏనుగుల్ని సాగనంపేందుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యల్లో తిరుపతి పద్మావతి మహిళ వర్సిటీ ఉపకులపతి ఆచార్య భారతి సోమవారం సాయంత్రం పదవికి రాజీనామా చేశారు. రాష్ట్రంలో ఉన్న విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, రిజిస్ట్రార్‌లు,రెక్టార్‌లు తమతమ పదవులకు రాజీనామా చేయాలని ఇప్పటికే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. ఉమ్మడి చిత్తూరుజిల్లాలోని అన్ని విశ్వవిద్యాలయాల విసిలు, రిజిస్ట్రార్‌లు తమతమ పదవులకు రాజీనామా చేసేశారు. పద్మావతి మహిళ వర్సిటీ విసి ఆచార్యభారతి మాత్రం రాజీనామా చేయలేదు. దీంతో సోమవారం ప్రభుత్వం నుండి అందిన ఆదేశాలతో ఆమె ఎట్టకేలకు సాయంత్రం పదవి నుండి తప్పుకున్నారు.కాగా గత వైసిపి ప్రభుత్వంలో వైసిపి నేతలతో అంటకాగడం, వారికి అనుకూలంగా వర్సిటీలో అడ్డగోలు పదోన్నతులు, పలురకాల పనులు చేపట్టారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఒక వర్గాన్ని విసి ఆచార్య భారతి వెనుకేసుకువచ్చిందని వర్సిటీ వర్గాల్లో చర్చ. దీంతో ప్రభుత్వం ఆమెను విసి పదవినుండి తప్పించింది. తిరుపతి ఎస్వీయూ ఇన్‌ఛార్జి విసికే తాత్కాలిక ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారనేది తెలుస్తోంది.

## ఆలయ ప్రతిష్టకు భంగం కలగకుండా సంప్రదాయాల పరిరక్షణ

### -టిటిడి ఈఓ శ్యామలరావు



తిరుమల,జులై 1ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామి  ఆలయ ప్రతిష్టకు భంగం కలగకుండా పురాతన సంప్రదాయాలు పరిరక్షించాలని టిటిడి ఈఓ జె.శ్యామలరావు ఆలయ అర్చకులు, వైఖానస ఆగమపండితులకు సూచించారు. ఆచారాలకు విఘాతం కలగకుండా చూసుకోవడంలో తమ పాత్రను ఈఓకు వివరించారు. టిటిడి ఆలయాల్లో వైకానస ఆగమాలను పరిరక్షణ, నిత్యకైంకర్యాలు, సంప్రదాయాలు అమలుచేయడంపై సోమవారం తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, కృష్ణశేషాచల దీక్షితులు, శ్రీనివాసదీక్షితులు, గోవిందరాజదీక్షితులు ,ఆగమసలహాదారులు మోహనరంగాచార్యులు, సీతారామా చార్యులు, రామకృష్ణదీక్షితులు, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం,పోటు పేష్కార్ శ్రీనివాసులుతోకలసి ఆలయంలో నిత్య కైంకర్యాలు, సేవలపై ఇఒ సుదీర్ఘంగా చర్చించారు.

## పాడి రైతుల నుండి పాలు తిరస్కరణ

### - పాల కేంద్రం ఎదుట పాడి రైతుల నిరసన



పాలసముద్రం, జులై 1 ప్రభాతవార్త: పాడి రైతుల నుండి మండలంలోని ఓ ప్రైవేటు డైరీ ఒక్కసారిగా పాలను స్వీకరించకపోవడంతో ఉత్పిత్తి అవుతున్న పాలను ఏం చేయాలని నిలదీస్తూ పాడి రైతులు పాల కేంద్రం ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రం పాలసముద్రం గుండుబావి సమీపంలో ఓ కేంద్రంను ఏర్పాటు చేసి  ఓ ప్రైవేటు డైరీ పాడి రైతుల నుండి పాలను సేకరిస్తోంది. ఈ మేరకు పాలసముద్రం గ్రామ పరిసరాల్లోని పాడి రైతులు అందరు ఈ కేంద్రంకు వచ్చి పాలు పోసి ప్రతి పదిహేను రోజులకు ఒకసారి పాల బిల్లు తీసుకొని వెళ్ళేవారు. అయితే వున్నట్లుండి పాల కేంద్రం సిబ్బంది పాడి రైతుల నుండి పాలు సేకరణను నిలిపివేసింది. ఈ విషయంపై పాల కేంద్రం ఎదుట నిరసనకు దిగిన ఒక మహిళ పాడి రైతు మాట్లాడుతూ గతంలో తమ గ్రామంకు ఇతర పాల డైరీలు వచ్చి పాలను సేకరిస్తే అడ్డుకున్న ప్రస్తుత డైరీ నిర్వాహకులు ఇప్పుడు తమ నుండి పాలను స్వీకరించకుంటే ఎలాగని నిలదీశారు. ఇక్కడి పాల కేంద్రం నిర్వాహకులు తమిళనాడు నుండి పాలను సేకరించి తమ నుండి స్వీకరించడం లేదని ఎవ్వరైనా ప్రశ్నిస్తే లీటరు పాలు రూ.21కు ఇవ్వాలని అడుగుతున్నారని వాపోయారు. ఈ మేరకు పెన్షన్ల పంపిణీ కార్యక్రమంకు పాలసముద్రం వచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ థామస్ దృష్టికి పాడి రైతులు తమ సమస్యను తీసుకెళ్ళారు. ఈ మేరకు ఎమ్మెల్యే పాల డైరీ నిర్వాహకులతో మాట్లాడి సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ఎర్రచందనం సహా వ్యక్తి పట్టివేత



యర్రావారిపాలెం, జూలై 1ప్రభాతవార్త

మండల పరిదిలోని భాకరాపేట అటవీ రేంజ్ పరిదిలో అటవీ అధికారులకు వచ్చిన రహస్య సమాచారం మేరకు తలకోన సౌత్‌బీట్ పరిదిలోని చింతకుంట వద్ద తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా పొదల్లో దాచిన దుంగలను తరలిస్తున్న ఇద్దరిని గమనించి లొంగిపొమ్మన్నారు. వారిలో ఒకడు పారిపోగా ఒకరు పట్టుపట్టాడు. పట్టుపడిన వ్యక్తి బెంగళూరు కొటిగనహళ్లికి చెందిన సైఫుల్లాఖాన్ అని అతని వద్ద నుంచి 116 కిలోలు ఉన్న 7 ఎర్రచందనం దుంగలు స్వాదీనం చేసుకున్నామని ఫారెస్టు సెక్షన్ అధికారి సలాుద్దీన్ తెలిపారు. అతన్ని అరెస్టు చేశామని పారిపోయిన వ్యక్తిని త్వరలో పట్టుకుంటామని చెప్పారు. ఈదాడులలో ఎప్‌బిఓలు నిఖిల్,రాజేష్, ప్రదీప్‌చంద్,సిబ్బంది పాల్గొన్నారు.

01యర్రావారిపాలెం2ః పట్టుబడ్డ నిందితుడితో ఎర్రచందనం దుంగలు సిబ్బంది

## 4న కుప్పంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

### - జిల్లా కలెక్టర్ గాంధీ సుమిత్‌కుమార్



కుప్పం, జూలై 1ప్రభాతవార్త

ఈనెల 4వతేది గురువారం కుప్పం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార క్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గా ంధీ సుమిత్‌కుమార్ తెలిపారు. ఆరోజు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నాం 1గంట వరకు ఈకార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా కుప్పం నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ముందడుగు వేసి ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతోందన్నారు. ప్రజలు తమ సమస్యలను అధికార యంత్రాంగం దృష్టికి తీసుకువస్తే సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. కుప్పంలో జరిగే కార్యక్రమంకు నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. కుప్పం నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

# మామిడి రైతు విలవిల

### రూ.23 కంటే మించని కేజీ తోతాపురి కాయ

### ఇతర రాష్ట్రాల నుండి దిగుమతి అయ్యే మామిడితో ఇక్కడి రైతుకు తీరని నష్టం



చిత్తూరు, జులై 1 ప్రభాతవార్త: ఈ మామిడి సీజన్‌లో తోతాపురి మామిడి రైతు బాధ వర్ణనాతీతం అయ్యింది. సీజన్ ప్రారంభంలో తోతాపురి మామిడి టన్ను 30 రూపాయలు పలకడం, ఆపై మరింత ధర పెరుగుతుందని ఆశల్లో విహరించిన రైతు ప్రస్తుతం కన్నీటి పర్యంతం అవుతున్నాడు. సీజన్ ప్రారంభంలో నాలుగైదు రోజులు మాత్రమే రైతు నుండి తోతాపురి రకం మామిడి కేజీ రూ.30 కొనుగోలు చేసిన ప్రాసెసింగ్ యూనిట్లు, ర్యాంపుల యాజమానులు ఆపై ధరను అమాంతంగా తగ్గించి వేశారు. ఈ సీజన్‌లో మామిడి దిగుబడి తక్కువగా వుండటంతో తాము ఊహించిన ధర కంటే అధికంగా ధర వుంటుందని మామిడి రైతులు భావించారు. అయితే అందుకు భిన్నంగా సీజన్ ప్రారంభంలో పలికిన ధర ఆపై కన్పించకపోవడంతో రైతుల్లో దిగులు ఆవరించింది. మార్కెట్‌లో ప్రస్తుతం తోతాపురి రకం మామిడి కేజీ రూ.22 నుండి రూ.23 కంటే ఎక్కువ పలుకడం లేదు. అత్యధిక ర్యాంపు యాజమానులు తోతాపురి మామిడి రైతులకు కేజీ రూ.22 చెల్లించి చేతులు దులుపుకుంటున్నారు. మామిడి రైతు ప్రాసెసింగ్ యూనిట్లు, ర్యాంపు యాజమానులకు పంట దిగుబడిని తీసుకెళ్ళి అప్పగించినప్పటికీ వారు అప్పటికప్పుడే తూకం వేసి రైతుకు ఆశించిన మేరకు డబ్బులు ఇవ్వడం లేదు. రైతు ప్రాసెసింగ్ యూనిట్ యాజమానులకు పంట దిగుబడి అప్పగించిన వారం, పది రోజుల అనంతరం వారికి డబ్బులు చెల్లించే పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో తోతాపురి రకం మామిడి ధర తగ్గడంతో అప్పటి కలెక్టర్ సగిలి షన్మోహన్ ఎట్టి పరిస్థితుల్లోను తోతాపురి రకం మామిడి కేజీపై రూ.30 ఇవ్వాలని ఆదేశించారు. ఆ ఆదేశాలు ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదు. నూతనంగా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సుమిత్‌కుమార్ మామిడి రేటుపై తగిన నిర్ణయం తీసుకుని రైతులకు న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది. జిల్లాలో 58 వేల హెక్టార్ల విస్తీర్ణంలో మామిడి సాగు వుంది. ఇందులో మెజార్టీ విస్తీర్ణంలో తోతాపురి రకం మామిడిని రైతులు సాగు చేస్తారు. తోతాపురి రకం మామిడి ప్రాసెసింగ్ యూనిట్లలో వినియోగిస్తుండటం, ధర నిలకడగా వుంటుండటంతో రైతులు ఈ రకం పంట సాగుపై మొగ్గు చూపుతారు. ఈ సీజన్‌లో వాతావరణం అనుకూలించకపోవడంతో పంట దిగుబడి భారీగా పడిపోయింది. జిల్లా వ్యాప్తంగా 20 శాతం మామిడి పంట సైతం ఈ సీజన్‌లో లేని పరిస్థితి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం కేవలం 16 వేల హెక్టార్ల విస్తీర్ణంలో మాత్రమే మామిడి పంట దిగుబడి వుంటుందని ఉద్యానవన అధికారులు పేర్కొంటున్నారు. ఇక తోతాపురి రకం మామిడి అయితే 10 నుండి 12 వేల హెక్టార్ల విస్తీర్ణంలో మాత్రమే పంట దిగుబడి అయ్యింది. ఈ పరిస్థితుల్లో జిల్లాలో పంట దిగుబడి తక్కువగా వుండటంతో ధర ఆకాశం అంటుతుందని రైతులు భావించారు. జిల్లాలో తోతాపురి మామిడిని ప్రాసెసింగ్ చేయడానికి 31 ప్రాసెసింగ్ యూనిట్లు వున్నాయి. ఇందులో 21 ప్రాసెసింగ్ యూనిట్లు రోజుకు 250 టన్నుల మేరకు ప్రాసెసింగ్ చేసే కెపాసిటీ వుంది. మరో 10 ప్రాసెసింగ్ యూనిట్లు రోజుకు 100 నుండి 200 టన్నుల వరకు తోతాపురి రకం మామిడిని ప్రాసెసింగ్ చేస్తాయి. జిల్లాలో మామిడి దిగుబడి లేకపోయినప్పటికీ తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల్లో పంట దిగుబడి ఎక్కువగా వుండటం, ఆ రాష్ట్రాల్లో తోతాపురి ప్రాసెసింగ్ యూనిట్లు లేకపోవడంతో ఇక్కడి రైతుకు తీరని నష్టం వాటిల్లుతుంది. అక్కడ ప్రాసెసింగ్ యూనిట్లు లేకపోవడం, పంట దిగుబడి అధికంగా వుండటంతో అక్కడి రైతులు తక్కువ ధరతో ఇక్కడి ప్రాసెసింగ్ యూనిట్లకు తోతాపురి మామిడిని సరఫరా చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుండి తక్కువ ధరకు తోతాపురి రకం మామిడి లభ్యం అవుతుండటంతో ప్రాసెసింగ్ యూనిట్ల యాజమానులు తమ లాభాలను దృష్టిలో వుంచుకుని ఆ మేరకు ఇతర రాష్ట్రాల నుండి వచ్చే మామిడిని తక్కువ ధరకు కొనుగోలు చేసే పరిస్థితి నెలకొంది. మరో 10 రోజుల్లో తోతాపురి రకం సీజన్ ముగిసే అవకాశం వుంది. ఇప్పటికే తోతాపురి రకం మామిడి రైతులు తక్కువ ధరకు కాయలను సరఫరా చేసి నష్టపోయారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం స్పందించి సీజన్ చివరి దశలోనైనా తోతాపురి రకం మామిడి రైతుకు గిట్టుబాటు ధర కల్పించేలా ధర నిర్ణయించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## పండుగ వాతావరణంలో పెన్షన్ల పంపిణీ

పాలసముద్రం, జూలై 1 ప్రభాతవార్త:



పాలసముద్రం మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం పండుగ వాతావరణంలో జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ థామస్ పెన్షన్ల పంపిణీకి హాజరై లబ్దిదారులకు పెంచిన పెన్షన్ మొత్తాలను అందజేసి మాట్లాడుతూ సిఎం నారా చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెంచిన పెన్షన్లు అందిస్తుండటంతో పెన్షన్ లబ్దిదారుల కళ్ళల్లో ఆనందం తాండిస్తోందన్నారు. ఎంపిడిఓ రామనాథరెడ్డి, ఎపిపి శ్యామల, అగ్రికల్చర్ బోర్డు ఛైర్మన్ శివప్రకాష్‌రాజు, తహసిల్దారు సుబ్బలక్ష్మి, ఎఒ విద్యావతి, ఎంఇఓ రాజేంద్రప్రసాద్, ఎపిఎం ఫరీద్‌మస్తాన్, మెడికల్ ఆఫీసర్ బాలసుబ్రమణ్యం, సర్పంచ్ తంగరాజు భానుప్రియ, పంచాయతీ కార్యదర్శులు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, నాయకులు, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

## పక్కాగా వాహనాల రికార్డులు

**పాలసముద్రం, జూలై 1 ప్రభాతవార్త:** వాహనదారులు వాహనాలు నడిపే సమయంలో పక్కాగా వాహనంకు సంబంధించిన రికార్డులను వుంచుకోవాలని పాలసముద్రం ఎస్ఐ భారతి స్పష్టం చేశారు. ఎస్ఐ భారతి సోమవారం బలిజకండ్రిగ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సరైన పత్రాలు లేని వాహనాలు, నెంబర్‌ప్లేట్లు లేని వాహనాలు పట్టుబడితే సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. అలాగే ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలపై వున్న పెండింగ్ చలానులను చెల్లించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపితే రూ.10 వేలు జరిమానా చెల్లించాలన్నారు. పలువురు వాహనదారులు హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడటంతో ఒకొక్కరికి రూ.135 అపరాధ రుసుం విధించారు.

## శుభ్రతతో అతిసార వ్యాధి నివారణ సాధ్యం

– ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పంరూరల్, జూలై 1 ప్రభాతవార్త



ప్రతి ఒక్కరూ శుభ్రత పాటిస్తే అతిసార వ్యాధి నివారణ సాధ్యమని ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక కొత్తపేట ఆయుష్మాన్ కేంద్రంలో అతిసార వ్యాధిపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. రోగాలను నివారించాలంటే శుభ్రత పాటించాలన్నారు. గతంలో తమ ప్రభుత్వం దోమలపై దండయాత్ర కార్యక్రమం చేపడితే వైకాపా మంత్రి అవహేళన చేశారన్నారు. అనంతరం వైకాపా ప్రభుత్వంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోగా ప్రజలు అనారోగ్యం పాలయ్యారన్నారు. సిఎం చంద్రబాబునాయుడు ముందుచూపుతో ఇలాంటి కార్యక్రమాలు చేపడ్తారన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, నేతలు గోపీనాథ్, కన్నన్, శాంతారాం, డా॥ వెంకటేష్, అప్పు, జనసేన, బిజెపి కన్వీనర్లు నరేష్, శివశంకర్, కౌన్సిలర్లు జిమ్‌దాము, సోమశేఖర్, సురేష్, వేలు తదితరులు పాల్గొన్నారు.

## గురువుకు పూర్వ విద్యార్థులు సన్మానం

**పాకాల, జూలై 1, ప్రభాతవార్త** పాకాల మండలం గవర్నమెంట్ హైస్కూల్‌లో జరిగినటువంటి రిటైర్మెంట్ సభలో 1995 – 96 సంవత్సరం 10వ తరగతి విద్యార్థులు వారి గురువు దాదాపు 35 ఏళ్ల కాలంలో ఎంతో మంది యువతీ యువకులను గొప్ప స్థాయిలలో నిలిపినటువంటి ఒక స్థితప్రజ్ఞుడు మా గురువు చిట్టి రమణప్ప పదవీ విరమణ సందర్భంగా ఘనంగా సన్మానించడం మాకు దక్కిన గొప్ప అవకాశం. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు 1995 – 96 బ్యాచ్ వారు పాల్గొన్నారు.

## సిఎం, డిప్యూటీ సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

**పాకాల, జూలై 1, ప్రభాతవార్త** పాకాల మండలం పాకాల గ్రామ పంచాయితీ 1, 2 నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని చిత్రపటానికి మహిళలు, ఫించన్ దారులు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం పెంచిన సామాజిక పెన్షన్లు సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు పంపిణీ చేశారు.

## పండగ వాతావరణంలో పెన్షన్ల పంపిణీ

**శాంతిపురం/రామకుప్పం, జూలై 1 ప్రభాతవార్త** శాంతిపురం, రామకుప్పం మండలాల్లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం పండగ వాతావరణంలో చేపట్టారు. ఉదయ ం ఆరుగంటల నుంచే సిఎం చంద్రబాబు చిత్రపటాలు, పోస్టర్లకు దేశం నేతలు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం పెన్షన్లను పంపిణీ చేశారు. గడ్డూరులో ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ పెన్షన్లను అందించారు. మండల టిడిపి అధ్యక్షులు విశ్వనాథనాయుడు, ఆనందరెడ్డి, నేతలు మునస్వామి, ఆంజనేయరెడ్డి, జనార్ధనరెడ్డి, ఉదయ్‌కుమార్, పత్ర నారాయణ, నరసింహులు, నాగభూషణంరెడ్డి, నాగరాజు, బాలరాజు, మణి, ఉయ్యాలజయరాంరెడ్డి, ఎల్.జయరాంరెడ్డి, గోవిందరాజులు, గోపాల్, రమేష్, అవినాష్, సుబ్రి, విజయ్‌కుమార్‌రెడ్డి, రాజారెడ్డి, రుద్రప్ప, శంకర్ అనసూయ, చంద్రకళ, సుగుణమ్మ, దయ, నవీన్, అమర్, సతీష్ పాల్గొన్నారు.

## జోరుగా పెంచిన పింఛన్లు పంపిణీ

**సదుం, జూలై 1 ప్రభాతవార్త** సిఎం చంద్రబాబునాయుడు ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు పెంచిన పించన్లు సోమవారం సదుం మండలంలో సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ చేశారు. తొలుత మండల పరిదిలోని తాటిగుంటపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద ఆగ్రామ మాజీ సర్పంచి మహేశ్వరరెడ్డి ఆద్వర్యంలో చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాన్, మోడీల చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం పించనుల పంపిణీ ప్రారంభించారు. అదేవిధంగా సదుం బస్టాండులో ప్రభుత్వ వైద్యశాల మాజీ ఛైర్మెన్ శ్రీనివాసులురెడ్డి ఆద్వర్యంలో, నడిగడ్డ గ్రామంలో పవన్‌కుమార్‌రెడ్డి ఈశ్వరరెడ్డిల అద్వర్యంలో పించన్ల పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో కృష్ణయ్య, వెంకటరమణారెడ్డి, వసంతకుమార్, అరవపాలెం రత్న, మౌలానా, గౌతంకుమార్‌రెడ్డి, పవన్‌కుమార్, గట్టు రమేష్, నారాయణ, రామచంద్రయ్య, మునిరెడ్డి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఒక్క రోజులో 90శాతం పెన్షన్ల పంపిణీ

**పలమనేరు, జూలై 1, ప్రభాతవార్త:** నియోజకవర్గంలో ఒక్క రోజులో సుమారు 90శాతం పెన్షన్లను పంపిణీ చేశారు. పలమనేరు పరిధిలో సోమవారం ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు సుమారు 90శాతం పెన్షన్లను పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది ప్రతి లబ్ధిదారుడి ఇంటి వద్దకు వెళ్లి వారికి పెన్షన్లను అందించారు. పట్టణంలోని బొమ్మిదొడ్డిలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 6 గంటలకు లబ్ధిదారులకు పెన్షన్లను పంపిణీ చేశారు. గడిచిన మూడు నెలలతో కలిపి రూ.7వేలను లబ్ధిదారులకు అందించడం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

## మొరాయించిన సర్వర్లు -పెన్షన్ల కోసం వృద్దుల పడిగాపులు

వి.కోట, జూలై 1, ప్రభాతవార్త:

వి.కోట మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కోసం వృద్దులు పడిగాపులు పడిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 6 గంటల నుండి పెన్షన్ల పంపిణీ చేపట్టారు. అయితే మండలంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో పెన్షన్ల పంపిణీ ఆలస్యమైంది. దీంతో వృద్ధులు పెన్షన్ల కోసం పడిగాపులు పడాల్సి వచ్చింది. పలు ప్రాంతాలలో సాంకేతిక సమస్యతో పెన్షన్ల కోసం వచ్చిన వృద్దులను తిప్పిపంపివేయడం జరిగింది.

## పార్టీ కార్యాచరణపై నాయకులతో మాజీ ఎమ్మెల్యే సమీక్ష



పలమనేరు, జూలై 1, ప్రభాతవార్త:

వైకాపా పార్టీ కార్యచరణపై సోమవారం మాజీ ఎమ్మెల్యే డా.వెంకటేగౌడా నియోజకవర్గ నాయకు లతో సమీక్ష నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన నాయకులతో సమీక్ష నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలో ప్రస్తుత పరిస్థితులపై ఆరా తీశారు. తనతో పాటు నాయకులు ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైకాపా కౌన్సిలర్లు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్‌టిఆర్ పింఛన్ కానుకతో అవ్వ తాతలకు భరోసా : ఎమ్మెల్యే థామస్

వెదురుకుప్పం, జూన్ 1 ప్రభాతవార్త

ఎన్నికల సందర్భంగా ఇచ్చిన సామాజిక భద్రత పెన్షన్ పెంపు హామి అమలు చేయడం జరుగుతుందని అవ్వ తాతలకు, వితంతువులకు, వికలాంగులకు చక్కటి బరోసా అని సద్వినియోగం చేసుకోవాలని గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ వియం. థామస్ సూచించారు. సామాజిక భద్రత పెన్షన్ పంపిణీ కార్యక్రమంను ఆయన ఎంపిడివో కార్యాలయంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు లోకనాథ రెడ్డి, మాజీ జిల్లా కార్యదర్శి మోహన్ మురళి, నియోజకవర్గం యువత అధ్యక్షులు గురసాల కిషన్ చంద్, టిఎన్‌టియూసీ నియోజకవర్గం ఉపాధ్యక్షులు పోటుగారి గంగయ్య, తెలుగు దేశం పార్టీ నాయకులు, ఎంపిడివో వరప్రసాద్, పింఛన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

## సిఎం, డిప్యూటీ సిఎం చిత్రపటాలకు పాలాభిషేకం



చిత్తూరు, జులై 1 ప్రభాతవార్త:

చిత్తూరు నగర కార్పొరేషన్ పరిధిలోని 9వ డివిజన్ పరిధిలోని గాంధీ నగర్‌లో సోమవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యుటీ సిఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులులు సోమవారం పెంచిన పెన్షన్ మొత్తంను లబ్దిదారులకు అందించే కార్యక్రమానికి సోమవారం తెల్లవారుజాము శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మాట తప్పని నాయకుడు చంద్రబాబు



**గంగాధర నెల్లూరు జూలై 1 ప్రభాతవార్త:** మాట తప్పని నాయకుడు మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని స్థానిక ఎమ్మెల్యే విఎం థామస్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయం వద్ద ఎన్నికల వాగ్దానంలో భాగంగా ప్రజలకు మాట ఇచ్చిన ప్రకారం 7000 రూపాయల పైన్షన్ లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి తారీకున అవ్వ తాతలు వితం తువులు ఎదురుచూసే పెన్షన్‌ను అనుకున్న విధంగా 7000 రూపాయలు పంపిణి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు స్వామిదాస్ నాయకులు దేవసుందరం జ్యోతీశ్వర్‌రెడ్డి ప్రకాష్ నాయుడు ప్రభాకర్ నాయుడు, ఎల్ సంపత్, కృష్ణమ నాయుడు, శరవణ, ప్రసాద్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## అవ్వా తాతల పోషణ బాధ్యత చంద్రన్నదే

చౌడేపల్లి, జూలై 1 ప్రభాతవార్త



అవ్వా, తాతల పోషణా బాధ్యత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుదని మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి), యువనేత మాదిరాజు ప్రదీప్‌రాజులన్నారు. చౌడేపల్లి పరిధిలోని గోసలకురపల్లి, ఆమినిగుంట పంచాయతీ శింగిరిగుంటల్లో ఎన్టీఆర్ భరోసా పించన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఇంటింటికీ వెళ్ళి పించన్లను పంపిణీ చేసారు. గోసలకురపల్లిలో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్‌కు వృద్ధులు పాలాభిషేకం చేసారు. ఎన్డీయే కూటమి తేదేపా నాయకులు ఆవుల రామచంద్రయ్య, శ్రీధర్‌రాజు(గిరి), పవన్‌కుమార్, రెడ్డిప్రసాద్, హరి, కార్తీక్, నారాయణరాజు, నాగేశ్వరరావు, సుబ్రమణ్యం, బేటప్ప, కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌రావు, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గన్నారు.

## విద్యావుపయోగకర వస్తువులు పంపిణీ

**చౌడేపల్లి, జూలై 1 ప్రభాతవార్త** స్నేహితులందరూ చేయి చేయి కలిపారు... పేద విద్యార్థులకు రాతపుస్తకాలు, బ్యాగులు వంటివి పంపిణీ చేసారు. పందిళ్ళపల్లి సుబ్రమణ్యం అతని మిత్రబృందంతో కలసి మండలంలోని శెట్టిపేట, మేకలచిన్నేపల్లి ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు రూ. లక్ష విలువ చేయు విద్యావుపయోగకర వస్తువులందించారు.

## 95శాతం ఎన్టీఆర్ భరోసా పించన్లు పంపిణీ

**చౌడేపల్లి, జూలై 1 ప్రభాతవార్త** ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పించన్లను మండలంలో 95శాతం వరకు పంపిణీ చేసినట్లు ఎంపిడిఓ శివప్రసాద్ తెలిపారు. మండలంలో 6707మంది పించనుదారులకు రూ. 4,44,80,500లు మంజూరైందన్నారు. సచివాలయ అధికారులందరూ ఉదయం నుంచి పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు.

## పండుగ వాతావరణంలో పెన్షన్ల పంపిణీ

**చిత్తూరురూరల్, జూలై 1 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామి మేరకు ఎన్టీఆర్ భరోసా సామాజిక ఫించన్లను పెంచిన ఫించన్ సొమ్ముతో పంపిణీ చేయడంతో లబ్దిదారులలో ఆనందం వెల్లివిరిసింది. సోమవారం చిత్తూరు పట్టణం, 37వ డివిజను ఎంజిఆర్ వీధిలో ఎన్టీఆర్ సామాజిక ఫించన్లను వృద్దులు, వితంతువులు, వికలాంగులకు డివిజన్ సచివాలయ అడ్మిన్‌తో కలసి భాజపా చిత్తూరు సెంట్రల్ మండల అధ్యక్షుడు షణ్ముగం పంపిణీ చేసారు. ఈ సందర్బంగా లబ్దిదారులు మాట్లాడుతూ పాలనను బిజెపి, జనసేన, టిడిపి నాయకులు గాడిలో పెడుతూ ప్రజలకు ఇచ్చిన హామిలను నెరవేరుస్తారని షణ్ముగం తెలిపారు.

## సంబరాల మధ్య పుంగనూరులో పెన్షన్లు పంపిణీ

**పుంగనూరు, జూలై 1 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పట్టణంలో పండుగ వాతావరణంలో సంబరాలతో ప్రతి ఇంటికి వెళ్ళి పెన్షన్లను పంపిణీచేశామని మున్సిపల్ కమిషనర్ నర్సింహప్రసాద్ అన్నారు. సోమవారం ఉదయం నుంచే పట్టణంలోని పలు ప్రాంతాలకు సచివాలయ అధికారులతో పాటూ మున్సిపల్ ఉద్యోగులు పరుగులు తీశారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో మొత్తం 5560 మందికి పెన్షన్లు పంపిణీ కోసం రూ.3,79కోట్ల రూపాయలను పంపిణీచేస్తున్నామని వివరించారు. ఉదయం మున్సిపల్ కమీషర్‌తో పాటూ తెలుగుదేశం నాయకులు శ్రీకాంత్, సయ్యద్ సుహేల్, దినేష్, హరిబాబు, గోపీలతో పాటూ, జనసేన నాయకులు రమణ, పార్టీనాయకులు, కార్యకర్తలు కూడా అధికారులకు తీడుగా నిలచి, పెన్షన్ల పంపిణీ కార్యక్రమం వేగవంతంగా జరిగేందుకు ముందుకు వచ్చారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## మాట నిలబెట్టుకున్న సిఎం చంద్రబాబు

### ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

చిల్లకూరు, జూలై 1, ప్రభాతవవార్త



ఎన్నికల సందర్భంగా పించన్ల పెంపుదల హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చింది. నేటి నుంచి పెంచిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు 7 వేల రూపాయిలు ఇంటింటికి పంపిణీ చేసి చరిత్ర సృష్టించిన చంద్రబాబు, ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు కొండేపాటి గంగా ప్రసాద్ తానంకి నానాజీ, సలహాలు మేరకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపినీ మండల అధ్యక్షులు ఉచ్చురు వెంకటేశ్వర్ రెడ్డిలు చిల్లకూరు మండలంలోని అన్ని గ్రామాల నాయకుల ఆధ్వర్యంలో అధికారులతో కలిసి పెన్షన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సన్నారెడ్డి వెంకటరమణారెడ్డి, దువ్వూరు కృష్ణారెడ్డి, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, గుండాల లీలావతి, పుడిపత్తి ప్రవీణ్ కుమార్ రెడ్డి, సర్వూరు నాగేశ్వరరావు నాయుడు, పచ్చ వెంకటేశ్వర్లు నాయుడు, దువ్వూరు రాజశేఖర్ రెడ్డి, పెద్దాయి ప్రవీణ్ కుమార్ రెడ్డి, మూగ శంకరయ్య, మేఘనూరు వెంకట కృష్ణయ్య రావుల వెంకటేశ్వర్లు, మేకల కుమార్, చిట్టేటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## తెల్లవారక ముందే పల్లెల్లో పింఛన్ల పంపిణీ

తడ, జూలై 1 ప్రభాతవార్త



రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పింఛన్ల పంపిణీని తడ మండలంలో తెల్లవారక ముందే ప్రారంభమైంది. ఈ నెలకు సంబంధించిన రూ.4 వేలుతో పాటు ముఖ్యమంత్రి ముందుగా ప్రకటించినట్లు మూడు నెలల పింఛన్‌తో కలిపి మొత్తం రూ.7వేలు ఒకేసారి పంపిణీ చేయడంతో లబ్ధిదారులు ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. తడ మండలంలో కొన్నిచోట్ల యాప్ పనిచేయక సర్వర్లు మొరాయించడంతో పింఛన్ల పంపిణీ కొంత ఆలస్యమైంది. మండల పరిధిలోని మిగిలిన గ్రామాల్లో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## చంద్రబాబు చిత్రపటానికి వాడవాడలా పాలాభిషేకం

### – పెంచిన సామాజిక పింఛన్లతో అవ్వాతాతల ఆనందం

చిట్టమూరు, జూలై 1 ప్రభాతవార్త

చంద్రబాబు సర్కార్ ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా ఇచ్చిన మాట నిలబెట్టుకునేలా పింఛన్ పంపిణీ కార్యక్రమం సోమవారం చిట్టమూరు మండలంలో ఓ పండుగలా ప్రారంభమైంది. వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, వితంతువులు, గీత కార్మికులు, డప్పు కళాకారులు, కిడ్నీ వ్యాధిగ్రస్తులు.. ఇలా అన్నిరకాల సామాజిక పింఛన్లు పెంచడంపై పింఛన్‌దారుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఆయా గ్రామాల్లో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసిన టీడీపీ శ్రేణులు స్వీట్లు పంచి ఆనందాన్ని వ్యక్తం చేశారు. చిట్టమూరులో మండల టీడీపీ కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు, గోపాల్‌నాయుడు, యల్లసిరిలో కాపులూరు చెంచురామాచారి, పోలిన శ్రీనివాస్, యాకసిరిలో చిన్నారావు, అబ్బయ్యనాయుడు, మల్లాంలో దువ్వూరు భారతమ్మ, సునీల్‌రెడ్డి, మస్తాన్‌రెడ్డి, ఈశ్వరవాకలో యల్లసిరి నాగార్జున, అరవపాలెంలో రాజేష్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న గొప్ప నాయకుడు చంద్రబాబు

నాయుడుపేట, జూలై 1 ప్రభాతవార్త



పేద ప్రజల పట్ల దయాగుణం కలిగిన ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడని సూళ్లూరుపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం నాయుడుపేట పట్టణ పరిధిలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా సీనియర్ నాయకులు శిరసనంబేటి విజయ భాస్కం రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ 786 రఫీతో కలిసి పింఛన్ల పంపిణీకి శ్రీకారంచుట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసిన నెలవల అనంతరం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఉయ్యాల ప్రవీణ్, నెలవల రాజేష్, మధుసూదన్‌రెడ్డి, చెంగయ్య తదితరులు ఉన్నారు.

....................

## నూతన చట్టాలపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలి

### గూడూరు డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి

గూడూరు, జూలై 1, ప్రభాతవార్త



మహిళల భద్రతకు మరిన్ని పదునైన నూతన చట్టాలు అమలులోకి వచ్చాయని నూతన చట్టాల పట్ల ప్రజలు అవగాహన పెంచుకోవాలని గూడూరు డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. బ్రిటిష్ కాలం నాటి చట్టాలు దేశంలో అమలులో ఉండడంతో కేంద్ర ప్రభుత్వం వాటి స్థానాల్లో నూతన చట్టాలను ప్రవేశ పెట్టారు. నూతన చట్టాలు జూలై 1వ తేదీ నుండి దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చాయి. దీంతో నూతన చట్టాలపై అవగాహన కల్పిస్తూ పోలీస్ శాఖ అధికారులు గూడూరు పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్ వద్ద ప్రజలకు కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా గూడూరు డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ గతంలో ఉండిన చట్టాల సంఖ్యను తగ్గించారని పలు కేసులకు సంబంధించి శిక్షకాల పరిమితి పెంచడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐలు, ఎస్ఐలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నీటి సరఫరాకు అంతరాయం

### గూడూరు పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు

గూడూరు, జూలై 1, ప్రభాతవార్త



గూడూరు పట్టణానికి నీరు అందించే పైపులు లీకేజీ వలన ఈ నెల 3,4వ తేదీలలో గూడూరు పట్టణానికి నీటి సరఫరా అంతరాయం ఏర్పడిందని గూడూరు పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని పురపాలక కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గూడూరు పట్టణ పరిధిలోని వేములపాలెం నుండి జండామాను వరకు గల మంచి నీటి జిఆర్‌పి పైపు లైనుకి సంబంధించి పది లీకులు ఏర్పడిందన్నారు. జిఆర్‌పి పైపు లైన్లు మరమత్తులలో భాగంగా గూడూరు ఒకటవ రెండవ పట్టణములలో మంచి నీటి సరఫరా అందించుటకు అంతరాయం కలిగింది. పట్టణ ప్రజలు గమనించి మంచి నీటిని పొదుపుగా వాడుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేసారు.

## పెన్షన్లు పెంపు దేశ చరిత్రలోనే నూతన అధ్యాయం

### ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

బాలాయపల్లి, జూలై 1, ప్రభాతవార్త



కనీ విని ఎరుగని రీతిలో సిఎం జగన్మోహన్ రెడ్డి పెన్షన్ పెంచడం దేశ చరిత్రలోనే నూతన అధ్యాయమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. మండలంలోని బాలాయపల్లి, వెంకగమాంబపురం గ్రామాలలో ఎన్టీఆర్ భరోసా నూతన పెన్షన్లను పెన్షన్ దారులకు వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ, మాజీ ఏఎంసి చైర్మన్లు సింగం శెట్టి భాస్కర రావు, సిసి నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు రావి మస్తాన్ నాయుడు, ఎంపిడిఓ అరుణాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్లు పెంచినట్లు తెలిపారు. ముందుగా వెంగమాంబ పురంలో ఎమ్మెల్యే రామకృష్ణకు గజమాలతో శాలువాలతో ఘన స్వాగతం పలికి పుష్పగుచ్చాలు అందజేశారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, సిఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పంపిణీ కార్యక్రమంలో టిడిపి నేతలు కందిమల్ల శ్రీహరి నాయుడు, దామా బాబులు నాయుడు, దామ మధునాయుడు, శ్రీహరి వెంకటాద్రి, ఎంపిడిఓ అరుణ, ఎంఆర్ఓ పుల్లారావు, తులసి, కోటేశ్వర గౌడ్ సర్పంచి దట్టం అంజలి, రావిసత్యం నాయుడు, కొర్రపాటి రామచంద్ర నాయుడు, సిసి నాయుడు, ఎస్ భాస్కర రావు, ఉప్పలపాటి మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

వెంకటగిరి, జూలై 1, ప్రభాతవార్త



సిఎం చంద్రబాబు నాయుడు పెన్షన్లు పెంచడంతో టిడిపి నాయకులు ఆయన చిత్రపటానికి గ్రామాల్లో పాలాభిషేకం నిర్వహించారు. పెంచిన పెన్షన్ల నగదును మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పప్పు చంద్రమౌళి రెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని చంద్రబాబు నాయుడు వెంటనే నెరవేర్చారని చెప్పారు. పెద్ద మొత్తంలో పెన్షన్లను పెంచి దేశంలోని సిఎం చంద్రబాబు నాయుడు ఆదర్శంగా నిలిచారని చెప్పారు.

## నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన

వాకాడు, జూలై 1, ప్రభాతవార్త



నూతన క్రిమినల్ చట్టాలు అమల్లోకి వచ్చిన నేపథ్యంలో బాధితులు ఇకపై ఏ పోలీస్ స్టేషన్‌లో పరిధి లోనైనా ఫిర్యాదు చేసుకోవచ్చని వాకాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు. సోమవారం వాకాడు అశోక పిల్లర్ సెంటర్ సమీపంలో ఆయన ప్రజలును ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా కొత్తగా తీసుకొచ్చిన చట్టాలపై సిఐ హరికృష్ణ అవగాహన కల్పించారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వారికి జీరో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తారు. నేర ఘటనా స్థలం అక్కడున్న పరిస్థితులు ఆధారాలు ఉంటేనే ఆడియో విడియో రికార్డు చేయాలి, దీనికోసం ఇప్పటికే ఏపీలోని ప్రతి పోలీస్ స్టేషన్‌కు క్యాబ్లు అందజేశారన్నారు. ఆయన వెంట వాకాడు సబ్ ఇన్స్పెక్టర్ పవన్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పండగలా ప్రారంభమైన పింఛన్ల పంపిణీ

వాకాడు, జూలై 1, ప్రభాతవార్త



మండల పరిధిలోని పంచాయితీ పరిధిలోని గ్రామంలో సోమవారం పింఛన్ల పంపిణీ అట్టహాసంగా ప్రారంభమైంది. సోమవారం ఉదయం 6 గంటల నుంచి పింఛన్ దారుల వద్దకే పింఛన్లు రావడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. మండల పార్టీ టిడిపి కన్వీర్ దువ్వూరు మధుసూధన్ రెడ్డి గొల్లపాలెం గ్రామం టిడిపి సీనియర్ నాయకుడు, ప్రముఖ పారిశ్రామికవేత సన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి, వాకాడులో సన్నారెడ్డి విజయశేఖర్ రెడ్డి, నందగోపాల్ రెడ్డి కొండాపురంగ్రామంలో తుమ్మల మోహన్ నాయుడు, వేణు నాయుడు, గోపి నాయుడు, సిద్దిగుంట పాలెం గ్రామంలో రామచంద్రయ్య, జమీన్ కొత్తపాలెం, వాలమీడు పంచాయితీలలో బిజెపి నాయకులు పురుషోత్తం రెడ్డి, ఎన్డీఏ కూటమి నాయకులతో కలిసి వృద్ధులకు దివ్యాంగులకు 7000 రూపాయిలు పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలోని పలు పంచాయితీలో టిడిపి నాయకులు పింఛన్లు వృద్ధులకు అందజేశారు.

## విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేద్దాం

వాకాడు, జూలై 1, ప్రభాతవార్త

ఈ నెల 4న మొట్ట మొదటిసారి వాకాడుకు ఎమ్మెల్యే సునీల్ కుమార్ రానున్న సందర్భంగా మండల టిడిపి కమిటి ఆధ్వర్యంలో ఘనంగా విజయోత్సవ ర్యాలీని చేపట్టాలని మండల కమిటీ కన్వీనర్ మధుసూధన్ రెడ్డి అన్నారు. సోమవారం వాకాడులో ఏఎంసి కార్యాలయ ఆవరణంలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూధన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి అధికారం చేపట్టాక గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ వాకాడు పర్యటనకు రానున్న సందర్భంగా బ్యారేజీ నుండి 1000 బైకులతో ర్యాలీ వాకాడు మీదుగా బీసీ కాలనీ నుండి గొల్లపాలెం వరకు ర్యాలీ జరుగుతుందన్న కార్యకర్తలు ఆయన సూచించారు. బిజెపి గూడూరు పార్టీ కన్వీనర్ పాపా రెడ్డి పురుషోత్తం రెడ్డి, విజయ శేఖర్ రెడ్డి, నందగోపాల్ రెడ్డి, సన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి, కృష్ణమూర్తి, మోహన్ నాయుడు, దువ్వూరు జనార్ధన్ రెడ్డి, ద్వారక నాథ్ రెడ్డి , రామచంద్రయ్య, తిరుమూరు శ్రీనివాసులు రెడ్డి, సంపత్ కుమార్, వల్లి ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పండుగ వాతావరణంలో పింఛన్లు పంపిణీ

కోట, జూలై 1 ప్రభాతవార్త

సామాజిక పింఛన్లు మొత్తం ఒకేసారి రూ.7 వేలు చొప్పున లబ్ధిదారులకు కేటగిరిల వారీగా పంపిణీ చేసినట్లు ఎంపిడిఓ శంకరయ్య చెప్పారు. సోమవారం మండలంలోని గూడలి, కోట తదితర గ్రామాల్లో ఆయన ఉదయం 6 గంటలకే పింఛన్లు పంపిణీ చేశారు. వంజివాక గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చిల్లకూరు దశరథరామిరెడ్డి, రమేష్, కోటలో జలీల్‌బాషా, తీగల సురేష్‌బాబు, తూపిలి రాధాకృష్ణారెడ్డి, కొక్కుపాడులో పలగాటి భాస్కర్‌రెడ్డి, కొత్తపాలెంలో నెల్లూరు మోహన్‌రెడ్డి, చెందోడులో వాకా విజయభాస్కర్‌రెడ్డి, చిట్టేడులో చంద్రశేఖర్, ప్రకాశం కాలనీలో గోపాలయ్యతో పాటు పలు గ్రామాల్లో తెలుగుదేశం నాయకులు, సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారు.

## తెదేపా కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం

రామకుప్పం, జూలై 1 ప్రభాతవార్త



మండలానికి చెందిన తెదేపా కార్యకర్త గోవిందప్ప రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. దీంతో అతని మృతి పట్ల దేశం నేతలు సంతాపం వ్యక్తం చేశారు. గోవిందప్ప మృతి పార్టీకి తీరని లోటని పేర్కొంటూ ఆయన మృతదేహానికి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర నేత మునస్వామి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

